క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

గ్రామ సచివాలయ సందర్శన



ఇందుకూరుపేట : విద్యా కోర్సులో భాగంగా మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం స్థానిక గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. వివిధ విభాగాలు, ఆన్‌లైన్ అప్లికేషన్ తదితర అంశాలపై సచివాలయ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. తొలుత విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం సుహాసిని, ఉపాధ్యాయులు వై.మునీంద్ర, మురళీధర్, కమలాకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

విశేషాలంకారంలో వెంకయ్యస్వామి



మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో గల భగవాన్ వెంకయ్యస్వామి మందిరంలో స్వామివారికి విశేష పూజలను శనివారం నిర్వహించారు. పంచామృతాభిషేకాన్ని అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. విశేష పుష్పాలంకారంలో కొలువైన స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. అన్నప్రసాదాన్ని మధ్యాహ్నం అందజేశారు. ఉభయకర్తలుగా పోలంరెడ్డి వెంకురెడ్డి, వెంకట నాగేశ్వరి వ్యవహరించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న జహీర్

మనుబోలు: ప్రభుత్వం నిర్ణయించిన ధరల కన్నా ఎక్కువకు ఎరువులను విక్రయిస్తే దుకాణ యజమానులపై చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి జహీర్ హెచ్చరించారు. మండలంలోని మడమనూరులో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఫిర్యాదు చేయడంతో గ్రామంలోని ఎరువుల దుకాణాలను శనివారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుత సీజన్లో రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

- భారీ వాహనాలతో గుంతలమయం
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

వామ్మో.. ఈ రోడ్డా..!



రోడ్డుపై ఏర్పడిన గుంత



గొలగమూడి సమీపంలో అధ్వానంగా రహదారి

వెంకటాచలం: ఆ రహదారిపై నిర్మాణ పనులు జరిపి ఎక్కువ రోజులు కాలేదు. అయితే ప్రస్తుతం భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ధ్వంసమైంది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని తిక్కవరప్పాడు – గొలగమూడి గ్రామాల మధ్య గల పంచాయతీరాజ్ రోడ్డు కొన్ని నెలలుగా అధ్వానంగా మారింది. దీంతో ఈ మార్గంపై రాకపోకలు సాగించాలంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు.

రూ.1.8 కోట్లతో నిర్మాణం

తిక్కవరప్పాడు – గొలగమూడి మధ్య ఆరు కిలోమీటర్ల రహదారిని రూ.1.8 కోట్లతో గతేడాది అక్టోబర్‌లో నిర్మించారు. మండలంలోని సర్వేపల్లి, ఇస్కపాళెం, నిడిగుంటపాళెం, పూడిపర్తి, గుడ్లూరువారిపాళెం, తిరుమలమ్మపాళెం, ఎగువమిట్ట, తాటిపర్తిపాళెం తదితర గ్రామాల ప్రజలు నెల్లూరుకు రాకపోకలను ఈ మార్గం మీదే సాగిస్తుంటారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన మూడు నెలల వరకు బాగానే ఉండింది. అయితే ఇటీవలి కాలంలో గ్రావెల్, ఇసుక టిప్పర్లు భారీ లోడుతో రాకపోకలు సాగిస్తుండటంతో రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఇవి మరింత దారుణంగా మారాయి. భారీ వాహనాలు తిరుగుతున్నా, అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య తీవ్ర రూపం దాలుస్తోంది. మరోవైపు జాతీయ రహదారిపై చెన్నై వైపు వెళ్లే లారీలు సైతం టోల్ గేట్‌ను తప్పించుకునేందుకు ఈ మార్గాన్నే ఆశ్రయిస్తున్నాయి. అర్ధరాత్రి వేళ వెళ్తుండటంతో స్థానికులు ప్రశ్నించలేకపోతున్నారు.

పట్టించుకునేవారేరీ..?

- తిక్కవరప్పాడు – గొలగమూడి గ్రామాల మధ్యలో రహదారి అధ్వానంగా మారడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాత్రి వేళ రాకపోకలు సాగించే ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి గాయపడుతున్నారు.
- స్కూటీ అదుపుతప్పడంతో కంటేపల్లికి చెందిన బాణాల శీనయ్య నాలుగు రోజుల క్రితం ఇక్కడ మృతి చెందారు.
- బైక్ అదుపుతప్పడంతో తిక్కవరప్పాడుకు చెందిన ఇద్దరు యువకులు ఈ ఏడాది నవంబర్‌లో గాయపడి ఆస్పత్రి పాలయ్యారు.
- సర్వేపల్లికి చెందిన మురళి సెప్టెంబర్‌లో నెల్లూరు నుంచి వస్తూ గుంతను తప్పించే క్రమంలో అదుపుతప్పి పడిపోయారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో వారం పాటు చికిత్స చేయించుకున్నాడు. ఇలా తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి రహదారిపై గుంతలను పూడ్చి, భారీ వాహనాలను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అద్దె గృహాలపై పోలీసుల దాడులు

వెంకటాచలం: మండలంలోని కసుమూరులో అద్దె గృహాలపై దాడులను పోలీసులు శనివారం నిర్వహించారు. కసుమూరులోని రెండు అద్దె గృహాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని పోలీసులకు సమాచారాన్ని కొందరు అందించారు. దీంతో దాడులను చేపట్టి, రెండు జంటలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

రీ సర్వేపై గ్రామసభ

పొదలకూరు: మండలంలోని అయ్యగారిపాళెంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివకృష్ణ మాట్లాడారు. రీ సర్వేకు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారని తెలిపారు. దీంతో ముందుగా గ్రామసభను నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో రీ సర్వేను నిర్వహించనున్నారని చెప్పారు. అభ్యంతరాలుంటే రైతులు అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. సర్వేయర్ గోపీనాథ్ పాల్గొన్నారు.

జగదేవిపేటలో ఉచిత వైద్య శిబిరం

ఇందుకూరుపేట : జాతీయ సేవా పథకంలో భాగంగా శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో జగదేవిపేటలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సి.కిశోర్‌కుమార్ పాల్గొని వైద్యసేవలు అందించారు. అనంతరం ఆధునిక వ్యవసాయంపై రైతులకు సూచనలు చేశారు. పీఎం కిసాన్, మేఘదూత్ తదితరాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకురాలు శైలజ, ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



కాలువల్లో ద్రావణం పిచికారీ

పొదలకూరు: మండలంలోని తాటిపర్తిలో గల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలను మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి నరసింహరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. గ్రామంలో ఫీవర్ సర్వే జరిపి, వీధుల్లో వర్షపు నీటి నిల్వలను పరిశీలించి బ్లీచింగ్ చల్లించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించాలని సూచించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆంజనేయవర్మ, ఎంపీహెచ్ఈఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మరణం తీరనిలోటు



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్

కోవూరు : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరనిలోటు అని కోవూరు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ సికిందర్ అన్నారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో మన్మోహన్ సింగ్ సంస్మరణ దినాన్ని శనివారం నిర్వహించారు. తొలుత ఆయన మృతికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ భారతదేశానికి అందించిన సేవలు చిరస్థాయిగా మిగిలిపోతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు గౌస్‌బాషా, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుపై శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో అధ్యాపకులు, శిక్షకులు

కొడవలూరు : మండలంలోని నార్నురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో పరిశ్రమల ఏర్పాటుపై అధ్యాపకులు, విద్యార్థులకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షకుడిగా కోదాడ సనా ఇంక్యుబేషన్స్ సెంటర్ సీఈఓ డాక్టర్ రామారావు హాజరై, మాట్లాడారు. పరిశ్రమల స్థాపనకు భారత ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ఐడియా హబ్‌లు, హ్యాకథాన్‌ల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు స్వయం ఉపాధి పొందడంతో పాటు ఇంకొంత మందికి ఉపాధి కల్పించేలా ఇలాంటి శిక్షణలు దోహదపడుతుందన్నారు. కార్యక్రమానికి ఆర్‌అండ్‌డీ డీన్ వెంకట నాగేంద్ర సమన్వయకర్తగా వ్యవహరించారు.

ఏకపక్షంగా వ్యవహరించి ఇబ్బందులు పడొద్దు



ముత్తుకూరు: అర్జీలు స్వీకరిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ముత్తుకూరు: ఏకపక్షంగా వ్యవహరించి ఇబ్బందులు పడొద్దని అధికారులకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని తాళ్లపూడి సచివాలయంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. మామిడిపూడిలో పేదలు సాగు చేసుకుంటున్న భూములను వాగు పొరంబోకు భూములుగా నమోదు చేశారని, దీన్ని సవరించాలంటూ వినతిపత్రాన్ని సీపీఎం నేతలు అందజేశారు.

పొదలకూరు: మండలంలోని గురవాయపాళెం, మొగళ్లూరులో రెవెన్యూ సదస్సులను తహసీల్దార్ శివకృష్ణ నిర్వహించారు. భూ సమస్యలు, పట్టాదారు పాస్‌పుస్తకాలపై వినతిపత్రాలను గ్రామస్తులు సమర్పించారు. వీఆర్వో పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నేతల నిరసన



తోటపల్లిగూడూరు: నరుకూరు – తోటపల్లి గూడూరు మధ్యలో కుంగిన బ్రిడ్జిని పునరుద్ధరించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సీఐటీయూ మండల కార్యదర్శి మారుబోయిన రాజా ఆరోపించారు. నరుకూరు సెంటర్ సమీపంలో కోడూరు కాలువ పక్కనే ఉన్న పంట కాలువ వంతెన పది రోజుల క్రితం ఒరగడంతో నరుకూరు – తోటపల్లిగూడూరు మధ్య వాహన రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. ఈ క్రమంలో వంతెన వద్ద నిరసనను సీఐటీయూ నేతలు శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇరిగేషన్, ఆర్ అండ్ బీ అధికారులు వెంటనే స్పందించి వంతెన వద్ద మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరారు. సీఐటీయూ మండల నేతలు వేగూరు శంకరయ్య, నాశిన గోపీ, అన్నం పరశురామయ్య, వేగూరు వెంకటేష్, కుడుముల మధు, కుడుముల చిరంజీవి, వెలిచర్ల రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు లైట్ల ఏర్పాటు



పొదలకూరు: పట్టణంలోని కేఆర్‌ఆర్‌నగర్‌లో విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలను పంచాయతీ పాలకులు యుద్ధప్రాతిపదికన శనివారం ఏర్పాటు చేయించారు. వీధి దీపాలు సక్రమంగా వెలగడంలేదంటూ ఫిర్యాదులు ఇటీవల అందాయి. దీంతో స్పందించిన ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఒకటో వార్డు సభ్యుడు అంజద్ సమస్యను పరిష్కరించారు. వీధి దీపాలు ఎక్కడైనా వెలగకపోతే సమాచారమివ్వాలని శ్రీనివాసులురెడ్డి కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

నెల్లూరు(బారకాసు) : పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ఎన్ఎంసీ అదనపు కమిషనర్ నందన్ తెలిపారు. ఎన్ఎంసీలోని కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో మెప్మా పీడీ రాధమ్మ, పలువురు అధికారులతో పాటు ఆర్పీలతో ఆయన శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ వన్ ఫ్యామిలీ–వన్ ఎంటర్ ప్రెన్యూర్ కార్యక్రమంలో భాగంగా పొదుపు సంఘాల సభ్యుల తలసరి ఆదాయం పెంచాలనే లక్ష్యంతో రానున్న వంద రోజుల్లో జీవనోపాధుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో టీఈ అంకయ్య, సుధాకర్, కాంతయ్య, సీఎంఎంలు కవిత, జరీనా, సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

గండవరంలో పారిశుద్ధ్య పనులు



కొడవలూరు : యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కావ్య ఆదేశాలతో మండలంలోని గండవరంలో శనివారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. గ్రామంలోని డ్రెయినేజీలు, మంచి నీటి నిల్వలున్న గుంతలు, మురుగు నీటి గుంతల్లో అబేట్ స్ప్రే చేశారు. కార్యక్రమంలో హెచ్ఎస్ సురేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ రోజ్‌మేరీ, ఏఎన్ఎం మమత, హెచ్ఏ నాగయ్య, పంచాయతీ కార్యదర్శి ఎం.బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

బొడ్డువారిపాళెంలో రెవెన్యూ సదస్సు



వినతులను స్వీకరిస్తున్న అధికారులు

కొడవలూరు : మండలంలోని బొడ్డువారిపాళెంలో తహసీల్దార్ కె.స్ఫూర్తి ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించగా వినతులు వెల్లువెత్తాయి. అయితే ఇందులో చిన్నపాటి సమస్యలు పరిష్కారమైనా దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు అలాగే ఉంటున్నాయి. వీటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న దాఖలాలు ఉండడం లేదు. ఫలితంగా రెవెన్యూ సదస్సులు వినతుల స్వీకరణకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. కాగా బొడ్డువారిపాళెం రెవెన్యూ సదస్సులో మండల సర్వేయర్ శ్రీలత, ఆర్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, వీఆర్వోలు దేవదాసు, సురేష్, విలేజ్ సర్వేయర్ శివ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యపై దృష్టి




ట్రాఫిక్ అడ్డంకులను తొలగిస్తున్న పోలీస్ అధికారులు

పొదలకూరు: పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై పోలీస్ అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో మెయిన్ రోడ్డుపై అడ్డుగా ఉన్న వాహనాలు, ఇతర ఆక్రమణలను సీఐ శివరామకృష్ణారెడ్డి దగ్గరుండి శనివారం తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా వ్యాపారుల బండ్లు, ఇతర అడ్డంకులను తొలగించి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చికెన్ దుకాణాల ఎదుట కోళ్ల వాహనాలను గంటల తరబడి నిలపేందుకు వీల్లేదని స్పష్టం చేశారు. వాహనాలను మెయిన్ రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపితే జరిమానాలు విధిస్తామని చెప్పారు. ఎస్సై హనీఫ్ దగ్గరుండి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కాంట్రాక్టర్ కక్కుర్తి.. కూలీలకు శాపం

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీలో మురుగు కాలువల పూడికతీత విషయంలో కాంట్రాక్టర్ కక్కుర్తి కూలీలకు శాపంగా మారింది. బుచ్చిరెడ్డిపాళెంలో ప్రధాన మురుగు కాలువగా ఉన్న కొత్త గుడపల్లి కాలువ పూడిక తీత కోసం రూ.5 లక్షలకు కాంట్రాక్టు అప్పగించారు. అయితే యంత్ర సాయంతో చేయాల్సిన పనిని మనుషుల చేత చేయిస్తుండడం విస్మయం కలిగిస్తోంది. ప్రధానంగా చెన్నూరు రోడ్డు నుంచి తూర్పు వైపునకు వెళ్లే కొత్త గుడపల్లి కాలువపై వ్యాపారస్తులు శ్లాబులు పోశారు. అయితే వాటిని తొలగించకుండానే మనుషుల ద్వారా పూడిక తీయడం గమనార్హం. ఇందులో ఒక్కో దుకాణ యజమాని వారి విస్తీర్ణాన్ని బట్టి కాంట్రాక్టర్‌కు డబ్బు చెల్లించినట్లు తెలిసింది. దీంతో కొంత మంది పూడిక తీసే సిబ్బందిని ఏర్పాటు చేసుకుని పది అడుగుల లోతు ఉన్న కాలువ నుంచి పూడికను తీసి పక్కనే ఉన్న ట్రాక్టర్‌కు వేస్తున్నారు. మొదట కాలువపై ఆక్రమణలు తొలగిస్తామని చెప్పిన నగర కమిషనర్ ఆ ఊసే ఎత్తక పోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఆక్రమణలు తొలగించకుండానే మురుగు తీసేందుకు అవస్థలు పడుతున్న కూలీలు



మురుగును తీస్తున్న కూలీలు



తీసిన మురుగును ట్రాక్టర్‌లో వేస్తున్న వైనం